ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 30
సంచిక : 152
పేజీలు : 3

మంగళవారం, ఫిబ్రవరి 24, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## దొంగల బీభత్సం



### 10 తులాల బంగారం, నగదు అపహరణ

**టీ.మీడియా,ఫిబ్రవరి23,దమ్మపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , అశ్వారావుపేట నియోజకవర్గం, దమ్మపేట మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో శనివారం రాత్రి దోపిడీ దొంగలు పది తులాల బంగారం, రూ.1,30,000 నగదు అపహరించుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డితెలిపిన వివరాల ప్రకారం దమ్మపేట మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కంభంపాటి గురునాథం అనే వ్యక్తి ఇంట్లోకి శనివారం రాత్రి ముగ్గరు గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు, చేతులకు గ్లౌజ్ లు ధరించి గురునాథం ఇంట్లోకి ప్రవేశించి భార్యా భర్తలు ఇద్దరినీ తాళ్లతో కట్టివేసి, చంపుతామని బెదిరించి, బీరువా తాళాలు తీసుకుని, బీరువాలోని పది తులాల బంగారం,

మిగతా 3లో

# పరీక్ష పరుగు





- 30 కిలోమీటర్ల దూరంలో సెంటర్లు
- ఆందోళన లో విద్యార్థులు, తల్లిదండ్రులు

**టీ.మీడియా,ఫిబ్రవరి23,భద్రాద్రి కొత్తగూడెం;**

**వార్షిక పరీక్షలంటేనే విద్యార్థులకు టెన్షన్ టెన్షన్‌గా ఉంటుంది. దీనికితోడు పరీక్షా కేంద్రాలు సైతం దూరంగా ఉంటే ఇక ఉరుకులు పరుగులు పెట్టాల్సిందే. పరీక్ష సమయానికి ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకోవాలంటే నానా తంటాలు పడాల్సిందే. భద్రాద్రి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలు విద్యార్థులకు దూరాభారంగా ఉన్నాయి. ఏకంగా నాలుగు మండలాల్లో 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచే శారు. దీంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరుగనున్నాయి. పరీక్షలు రాసేందుకు ఈసారి కూడా భద్రాద్రి జిల్లా విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇంటర్ విద్యపై పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నది. ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. భద్రాద్రి జిల్లాలో 18,600 మంది విద్యార్థుల కోసం 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. జిల్లాలో 23 మండలాలుండగా.. అందులో ఐదు మండలాలైన ఆళ్లపల్లి, కరకగూడెం, దమ్మపేట, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లిల్లో సర్కారు కాలేజీలు లేవు. దీంతో విద్యార్థులు 20 నుంచి 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పరీక్షలు రాయాల్సి వస్తున్నది. ఇంటర్ విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినా.. అవి మండల కేంద్రాలకు మాత్రమే వస్తుంటాయి. పల్లెప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సుల్లేక ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

**ఇవిగో సమస్యలు..**

అన్నపురెడ్డిపల్లి మండలంలో ఐదు సంక్షేమ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో 400 మందికి పైగా విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. కానీ ఆ మండలంలో ఒక్క పరీక్షా కేంద్రం కూడా లేకపోవడంతో విద్యార్థులు చండ్రుగొండ వచ్చి పరీక్షలు రాయాలి. కాలేజీ యాజమాన్యాలు బస్సులు ఏర్పాటు చేసినా విద్యార్థులు అంతదూరం ప్రయాణం చేసి పరీక్ష రాయాలంటే చదవింది మర్చిపోయే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆళ్లపల్లి మండలం మర్కోడులో ఒకేషనల్ జూనియర్ కాలేజీ ఉంది. కానీ అక్కడ పరీక్షా కేంద్రం లేదు. 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండాల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సెంటర్ ఉండడం వల్ల వారంతా అక్కడి వచ్చి పరీక్ష రాయాల్సి ఉంది. ఈ రూట్‌లో కనీసం బస్సు సౌకర్యం కూడా ఉండదు. టాటా ఏస్ వాహనంలో వెళ్లాల్సిన పరిస్థితి. దమ్మపేట మండలంలో రెండు సంక్షేమ కాలేజీలు ఉన్నాయి.

మిగతా 3లో




## స్పోర్ట్స్-మీట్‌లో జిల్లా పోలీసుల ఉత్తమ ప్రదర్శన

**-అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**టీ.మీడియా,ఫిబ్రవరి23, భద్రాద్రి కొత్తగూడెం:** గత వారం రోజులుగా సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 19 పతకాలు (06-బంగారు, 06-రజత, 07-కాంస్య) సాధించి జిల్లాను ముందు వరుసలో నిలిపారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజేతలకు పతకాలు అందజేసిన ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.గెలుపోటములు సహజమని, విజేతలు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలని, ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా తమ లోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచించారు.జిల్లాకు పతకాలు తీసుకువచ్చిన క్రీడాకారులందరిని ప్రత్యేకంగా అభినందించారు. టేబుల్ టెన్నిస్ ఓపెన్ సింగిల్స్ విభాగంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్ రజత పతకాన్ని సాధించారు. 45 సంవత్సరాల పైన బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ రజత పతకాన్ని సాధించారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్ నాయక్ బాడ్మింటన్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. పాల్వంచ సిఐ కే.సతీష్ టెన్నిస్ టీం విభాగంలో రజత పతకాన్ని సాధించారు. వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు టెన్నిస్ డబుల్స్ విభాగంలో రజత పతకాన్ని సాదించారు. కొత్తగూడెం 3టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిసున్న బి.రత్నకుమారి నాలుగు పతకాలను సాధించినది.మహిళల బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం,ట్రేడిషనల్ యోగా విభాగంలో బంగారు పతకం,జిమ్నాస్టిక్స్



విభాగంలో రజతం, కళాత్మక యోగా విభాగంలో ఒక కాంస్య పతకం సాధించారు. ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ప్రవీణ్ బ్యాడ్మింటన్ సింగిల్స్ లో బంగారు పతకం,మిక్సడ్ డబుల్స్ విభాగంలో రజత పతకాన్ని సాధించారు. జిల్లా ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిసున్న మహిళా పోలీసు కానిస్టేబుల్ డి.సుష్మ 100 మీటర్లు,200 మీటర్లు పరుగు పందెం విభాగాలలో బంగారు పతకాలు సాధించారు.చంద్రుగొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న బి.రజని ఖోఖో,రిథమిక్ యోగా విభాగాలలో 02 కాంస్య పతకాలు సాధించారు. ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ వి.వంశీ 100 మీటర్లు,200 మీటర్ల పరుగు పందెం విభాగాలలో 02 కాంస్య పతకాలను సాధించారు. అశ్వాపురం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ నాగస్వరూప బ్యాడ్మింటన్ మిక్సడ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం,విమెన్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు.



## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**టీ.మీడియా,ఫిబ్రవరి23,ఖమ్మం:**ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన భీమిరెడ్డి పుల్లారెడ్డి భరణిపాడు నుంచి పర్వతాపురం ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలతో అధ్వాన్నంగా ఉందని, భరణిపాడు కాలువ మీద ఉన్న వంతెన శిథిలావస్థలో ఉందని, వీటికి అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ ఆర్ అండ్ బీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం ఖానాపురం హవేలికి చెందిన ఎన్. నటరాజ్ తాను దివ్యాంగుడినని తనకు సొంత ఇల్లు లేనందున ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.నేలకొండపల్లి మండలం అప్పల నర్సింహపురం గ్రామస్తులు

మిగతా 3లో




## అంగన్‌వాడీ వేతనాల పెంపు డిమాండ్

**-సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు.**

**టీ.మీడియా,ఫిబ్రవరి23,చింతూరు:**అంగన్‌వాడీ వేతనాల పెంపు, సమస్యల పరిష్కారంపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన దీక్ష అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని, సేవా నిబంధనల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు రెండు రోజులపాటు నిరసన దీక్షలు చేపట్టారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి తగిన వేతనాలు ఇవ్వడం లేదని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, హెల్పర్లకు తగిన పెంపు కల్పించాలని కోరారు. అదేవిధంగా 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి, రిటైర్ అయిన వారికి అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలని కోరారు. పనిభారం పెరిగినా సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మరియు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



## కొలువుదీరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు.

**టి మీడియా, ఫిబ్రవరి 23, కొత్తగూడెం;**సోమవారం రోజు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారిల సమక్షంలో కొత్తగూడెం కార్పొరేషన్ లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికైన 8 మంది కార్పొరేటర్లు వేల్పుల వీరమ్మ, మల్హోత్రా సాగర్, భీమా శ్రీవల్లి, గుగులోత్ రాంబాబు,మల్లెల స్వప్న, సింధు తపస్వి, బత్తుల మధుచంద్, గుణ చరిత్ల చేత మున్సిపల్ కమిషనర్ కె. సుజాత ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రమాణస్వీకార అనంతరం బిఆర్ఎస్ కార్పొరేటర్లను ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచన మేరకు స్థానిక బిఆర్ఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. 8మంది కార్పొరేటర్లకు శాలువా కప్పి, పూల బొకే ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్ లను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, సయ్యద్ ఇస్మాయిల్, బీమా శ్రీధర్, మల్లెల రవిచంద్ర, కాంపెల్లి కనకేష్, కొట్టి వెంకటేశ్వర్లు, బొమ్మిడి రమాకాంత్, బొమ్మిడి శ్రీకాంత్, రాజేష్ (కన్ని), సంకు బాపన అనుదీప్, ముత్యాల రాజేష్, కరాటే శ్రీనివాస్ యాదవ్, బట్టు మంజల, వీరన్న, డాబా శంకర్, దుర్గాప్రసాద్, వాసుమల్ల గౌతం, మరియు కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో రాహుల్

**టీ.మీడియా,ఫిబ్రవరి23,భద్రాచలం:** శ్రీ జ్వాల లక్ష్మీ నరసింహ స్వామి స్వయంభు తిరు కళ్యాణ మహోత్సవాలకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ను ఆహ్వానించడం జరిగిందని శ్రీ జ్వాలా లక్ష్మీనరసింహ ఆలయం పూజారి పూలబోయిన రవితేజ అన్నారు. సోమవారం నాడు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి చాంబర్లో శ్రీ జ్వాలా లక్ష్మీ నరసింహ స్వామి స్వయంభు తిరుపతి కళ్యాణ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు వాల్పోస్టర్లు పిఓ చేత విడుదల చేయడం జరిగిందన్నారు. కరకగూడెం మండలం బుద్ధారం గ్రామంలో మార్చి మూడో తేదీ నుండి 8 తేదీ వరకు జరుగునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా చైతన్య శక్తి నాయకురాలు కొండ్రు సుధారాణి, వీసాల కృష్ణయ్య, ఆదివాసి యువ నాయకులు ఇర్పా శీను తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి

**పీఆర్‌పీఏ జిల్లా కన్వీనర్**

**యలమద్ది వెంకటేశ్వర్లు**



**టీ మీడియా,ఫిబ్రవరి23, సింగరేణి (కారేపల్లి):** పెన్షనర్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రోగ్రెసివ్ రికగ్నైడ్ పెన్షనర్స్ అసోసియేషన్(పీఆర్‌పీఏ)జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు(వైవీ) డిమాండ్ చేశారు. సోమవారం కారేపల్లిలో పీఆర్‌పీఏ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఉద్యోగ సమయంలో దాచుకున్న డబ్బులను వెంటనే విడుదల చేసి, వారికున్న సమస్యల నుండి విముక్తి పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ పొంది 22 నెలలు గడుస్తున్నప్పటికి, గ్రాట్యువిటీ, కమ్యుటేషన్ జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఇవ్వకపోవడంతో పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా మనోవేదనకు గురవుతున్నారన్నారు. పెన్షనర్స్ కు వెంటనే హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని, పీఆర్సీ ప్రకటించి, బకాయిలో ఉన్న డి.ఎ లను విడుదల చేయాలని కోరారు. అనంతరం పీఆర్‌పీఏ సభ్యత్వ నమోదు చేయించారు. ఈకార్యక్రమంలో నాయకులు వీ. సీతారామయ్య, వి. మోహన్ దాస్, పీ.మాధవరావు, దామోదర్ రెడ్డి, ఎండి బాబు, సిహెచ్ వెంకటేశ్వర్లు, కే.భద్రయ్య , జీవీ.రంగారావు, బి.రమాదేవి, బి.వెంకటరెడ్డి, ఏ.బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.



## బంజరాల ఆరాధ్య దైవం సేవాలాల్

**-ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య**

**టీ మీడియా ఫిబ్రవరి 23,కామేపల్లి:**బంజారాల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ అని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. మండలంలోని రామకృష్ణ పురం గ్రామంలో సోమవారం నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణ కోసం భోగి బండారో కార్యక్రమం చాలా విశిష్టమైందని బంజర జాతి గొప్పతనాన్ని తెలియజేస్తుందని తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పంటలు బాగా పండాలని హోమ గుండాలు తయారుచేసి ప్రత్యేకంగా నెయ్యితో వంటకాన్ని ప్రసాదంగా తయారు చేయడం గొప్ప కార్యక్రమం అని అన్నారు. అనంతరం జోగు గూడెం, కామేపల్లి, టేకుల తండా, పాత లింగాల, రాయి గూడెం, పోన్నెకల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు చేయించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని వెల్లడించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి తహసిల్దార్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పలు గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నీటి సరఫరా పైపులను ధ్వంసం

**-పోలీస్ స్టేషన్ లో పిర్యాదు**

**టీ మీడియా, ఫిబ్రవరి 23,తిరుమలాయపాలెం** :మండలపరిదిలోని బచ్చోడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రాగు నీటి సరఫరా పైపులను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఒక పైపును తీసుకెళ్లారని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.కృష్ణ మోహన్ స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ ఘటనను గ్రామపంచాయతీ సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ గ్రామ వార్డు సభ్యులు 7,9 వార్డు సభ్యులు, రామకృష్ణ, రాజు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గొర్రెపాటి రమేష్, వీరస్వామి లు సందర్శించారు. వెంటనే పాఠశాలలోని పైపు మరమ్మతులను చేపట్టి విద్యార్థులకు ఇబ్బంది కలవకుండా నీటి వసతులను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఎస్సై కూచిపూడి జగదీష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.



## పసికందు మృతిపై కొవ్వొత్తుల ర్యాలీ

**పసికందు మృతి మానవత్వానికి మచ్చతెచ్చే ఘటన**

**టీ మీడియా,ఫిబ్రవరి23, సింగరేణి (కారేపల్లి):**పసికందు మృతి పై నిరసిస్తూ కారేపల్లి మండలం సీతారాంపురంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో యువకులు కొవ్వొత్తులు పట్టుకోని కులవివక్షత, అణగారిన వర్గాలపై దాడులను నిరసించారు. ఈసందర్భంగా ధర్మసమాజ్ పార్టీ సింగరేణి మండల కన్వీనర్ గుండమల్ల కార్తీక్ కుమార్ మాట్లాడుతూ పసికందు బేబి మౌనిక కుల మౌఢ్యానికి బలి కావటం విచారకరమన్నారు. ఘటన జరిగిన వెంటనే బాధితులకు అండగా ఉండాల్సిన అధికార వ్యవస్థ దాడి చేసిన అగ్రకులస్తులకు వత్తాసు పలుకుతూ బాధితులపై కేసు నమోదు చేయటం విచారకరమన్నారు. బాలిక మృతి కేసులో నిందుతులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు కుమ్మరికుంట ఉపేందర్, పూనెం రవి, నవీన్‌నాయక్, సాయుకుమార్, రాకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్లేడు సంత ఏర్పాటు

**టీ మీడియా, ఫిబ్రవరి 23, తిరుమలాయపాలెం :**తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా సంత ఏర్పాటు చేయబడిందని . ఈ సంతను ప్రతి మంగళవారం రోజున నిర్వహించనుండగా గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో రైతులకు న్యాయమైన ధర లభించనుందని నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి సూచనల మేరకు గ్రామ సర్పంచ్ సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి నేతృత్వంలో ఈ నూతన సంత ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు. ఈ సంత ప్రారంభంతో స్థానిక రైతులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గ్రామంలో నిత్యావసరాల కొనుగోలు సులభమవడంతో ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు హర్షాతిరేకాలతో స్వాగతిస్తూ సంతను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.





## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**-ఈఈ సుమంత్**

**టీ.మీడియా,ఫిబ్రవరి23,రుద్రంపూర్:** పారిశుధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కొత్తగూడెం ఏరియా సివిల్ ఈఈ సుమంత్ స్పష్టం చేశారు. సోమవారం ఏరియా పరిధిలోని ధన్బాద్ ప్రాంతంలో జరుగుతున్న సివిక్ పనులను సూపర్‌వైజర్ నిఖిల్ ఆధ్వర్యంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల తీరు, నిర్వహణ విధానం గురించి సంబంధిత సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా రోడ్లపై చెత్త పేరుకుపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్త కుండీలను నిర్ణీత వ్యవధిలో ఖాళీ చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రతను కాపాడాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఈఈ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సూపర్‌వైజర్ షకీల్ పాల్గొన్నారు.



## 'మహిళా న్యాయవాదుల సదస్సు

**టీ.మీడియా,ఫిబ్రవరి23,రుద్రంపూర్ :** ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పీ.ఏ) తెలంగాణ రాష్ట్ర మహిళా న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సాధనాల భానుప్రియ, మహమ్మద్ సాదిక్ పాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనపరెడ్డి గోపి కృష్ణ మాట్లాడుతూ.. మహిళా న్యాయవాదులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణతో పాటు, న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తీసుకునే చర్యల గురించి చర్చించి నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు సుజాత ఛౌడంటే తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి లో ప్రముఖ మహిళా న్యాయవాదులు పాల్గొని ప్రసంగించనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐఎల్‌పీఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ భాధ్యులు పగిడిపల్లి శ్రీకాంత్, ఆడపాల పార్వతి, మల్లెల ఉషా రాణి, కాకటి నీలివేణి, గుమ్మడి శాంత, లక్ష్మి సరిత, బేబి షామిలి, నకిరేకంటి ఉమా, భార్గవి, రజిత, న్యాయవాదులు రేపాక మనోరమా, ఏపూరి బాబురావు, ఉటూకురి పురుషోత్తం, రావి విజయ్ కుమార్, జీవికే మనోహర్ రావు, ఉట్లా రాజేశ్వరావు, భాగం మాధవ రావు, కాటబోయిన స్వర్ణలత, నాగ శ్రావంతి, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

## వృక్షాల నరికివేతపై అటవీ శాఖ స్పందించాలి

**టీ.మీడియా,ఫిబ్రవరి23,మణుగూరు:** ఏరియాలో నిద్రమాను వృక్షాల నరికివేత పై అటవీ శాఖ స్పందించాలని సామాజిక సేవకులు కర్నే బాబురావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఫారెస్ట్ ఏవో కెఎస్ఎన్ మూర్తికి ఫిర్యాదు చేసినట్లు బాబురావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో సుమారు 50 ఏళ్ల వయసున్న వృక్షాలను ఎలాంటి అనుమతులు లేకుండా నరకించిన వారి పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విష యంపై అటవీ శాఖ స్పందించకపోతే గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు అంతేకాకుండా పీవీ కాలనీలో అనుమతి లేకుండా నరికించిన ఇతర వృక్షాలపై కూడా విచారణ జరిపించి చెట్లను రక్షించాలని పర్యావరణ పరిర క్షణ తగు చర్యలు చేపట్టాలని కోరారు.



# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



**టీ.మీడియా,ఫిబ్రవరి23,ఖమ్మం:** జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలనిఅదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలలో మన జిల్లాకు చెందిన 16975 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరవుతున్నట్లు, వీరి కోసం 98 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అవసరమైన మేర భద్రత ఏర్పాట్లు కల్పించాలని అదనపు కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు ఏర్పాటు చేయాలని, ప్రతి ఫ్లయింగ్ స్క్వాడ్ లో డిప్యూటీ తహసిల్దార్, ఎస్ఐ సభ్యులుగా ఉండాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటుకు సిబ్బంది వివరాలు అందించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో ప్రతి పరీక్షా కేంద్రం చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని అన్నారు. ప్రశ్న పత్రాల తరలింపుకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో పెట్టాలని అన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అవసరమైన రూట్ లలో బస్సులు నడపాలని అదనపు కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. ప్రశ్న పత్రాలను సమీప పోలీస్ స్టేషన్ నందు భద్రపరిచి పరీక్ష రోజు బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు సకాలంలో సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ వై. లక్ష్మీప్రసాద్, విద్యాశాఖ ఏడి చావా శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దొంగల బీభత్సం

రూ.1, 30,000/-ల నగదును అపహరించుకుపోయారు.విషయం తెలుసుకున్న పోలీసులు పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి , సిబ్బంది సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తో వెళ్లి పరిశీలించారు. దోపిడీ దొంగలు ఇంటి వెనుక వైపు నుండి లోనికి ప్రవేశించి ఉంటారని, ఇది తెలిసిన వాళ్ళ పని అయ్యుంటుందని, లేకపోతే వెనుక భాగంలో మామిడి, పామాయిల్ తోట, ఫెన్సింగ్ దాటి లోనికి ఎలా వస్తారనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని, గురునాధం భార్య ఉదయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు .

## పంచాయతీ కార్మికుల సంఘం

## అధ్యక్షులుగా కొండ సైదులు గౌడ్



**టీ.మీడియా,ఫి బ్రవరి23,గరిడేపల్లి:** మండల గ్రామ పంచాయతీ కార్మికుల సిఐటియు అనుబంధ సంఘం అధ్యక్షులుగా కొండ సైదులు గౌడ్ ఎన్నికయ్యారు. మండలంలోని అప్పన్నపేట గ్రామంలో యూనియన్ మండల మహాసభ రావుల వెంకన్న అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.సిఐటియు అనుబంధ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షులుగా కొండ సైదులు, ప్రధాన కార్యదర్శిగా అమరవరపు శ్రావణ్ కుమార్ ఎన్నుకున్నట్లు సిఐటియు జిల్లా నాయకులు షేక్ యాకూబ్ తెలిపారు.మొత్తం ఎనిమిది మందితో నూతన కమిటీని ఎన్నికైనట్టు ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కొండ సైదులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## తహసిల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



**టీ.మీడియా,ఫి బ్రవరి23,గరిడేపల్లి:** గరిడేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు దురుసుగా అసభ్యకరంగా మాట్లాడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.పొనుగోడు గ్రామానికి చెందిన కానుగు సైదులు, పెద్దవూర పాఠశాల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ కోసం మూడు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. సోమవారం తహసిల్దార్ సంతకం కోసం క్యాబిన్‌లోకి వెళ్లిన సమయంలో తాసిల్దార్ స్రవంతి తనపై కోపంగా నిర్లక్ష్యంగా మూసుకో అంటూ అసభ్యకరంగా మాట్లాడి కించపరిచారని సైదులు ఆవేదన వ్యక్తం చేశారు.ఓటిఆర్ సర్టిఫికెట్ గడువు ముగిస్తుందని అత్యవసరమని వేడుకున్నప్పటికీ, తగిన స్పందన రాలేదని పేర్కొన్నారు. కార్యాలయ సమయాల్లో అధికారుల ప్రవర్తన ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదని ఆయన అన్నారు.దురుసుగా మాట్లాడిన తహసిల్దార్ పై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సేవలో ఉన్న అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పరీక్ష పరుగు

కానీ అక్కడ ఇంటర్ పరీక్ష కేంద్రం లేదు. అశ్వారావుపేట మండలానికి వెళ్లి పరీక్ష రాయాలి. బస్సు సమయానికి వస్తే సరేసరి. లేకుంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిందే.

కరకగూడెం మండలంలో కూడా ఇంటర్ పరీక్షా కేంద్రం లేకపోవడంతో పినపాక మండలం వచ్చి పరీక్షలు రాయాల్సి ఉంది. 15 కిలోమీటర్ల దూరం ఆటోలు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి.

సుజాతనగర్ మండలంలో సగభాగం ఇప్పుడు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిసింది. కానీ, అక్కడ ఉన్న మారుమూల గ్రామాల విద్యార్థులకు కాలేజీ సౌకర్యం లేకపోవడంతో కొత్తగూడెం వచ్చి చదువుకుంటున్నారు. పరీక్షలు రాసేందుకు కూడా 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

**పరీక్ష కేంద్రం ఏర్పాటుచేయాలి**

మా మండలంలో ఐదు కాలేజీలు ఉన్నాయి. కానీ పరీక్షా కేంద్రం మాత్రం లేదు. మా మండల విద్యార్థులు ఏటా ఇలానే ఇబ్బందులు పడుతున్నారు. బస్సులపై వెళ్లి పరీక్ష రాయాల్సి వస్తున్నది. స్థానికంగా పరీక్షా కేంద్రం ఉంటే పరీక్షా సమయం వరకు కొంత రివిజన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఉదయాన్నే లేచి తయారై బస్సు కోసం చూడాలి. దీంతో ఒత్తిడికి గురవుతున్నాం. మాకు పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి.

**-పి.వేణు, ఇంటర్ ఫస్టియర్, అన్నపురెడ్డిపల్లి**

**మాకు బస్సులు కూడా లేవు..**

మాది ఆళ్లపల్లి మండలం. మర్కోడులో ఒకేషనల్ కోర్సు చేస్తున్నాను. కాలేజీ ఉందిగానీ పరీక్ష కేంద్రం లేదు. మా ప్రాంతానికి బస్సులు కూడా ఉండవు. టాటామేజిక్, టాటా ఏస్ వంటి ప్రైవేటు వాహనాలు ఎక్కి వెళ్లాలి. అదే రూట్‌లో వాహనం పంచర్ అయిందంటే పరీక్ష పోయినట్లే. అసలే మారుమూల అటవీ ప్రాంతం. గుండాల 25 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

**-ఎండీ అస్లాం, ఒకేషనల్ ఇంటర్, మర్కోడు, ఆళ్లపల్లి**

**బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం..**

జిల్లాలో ఐదు మండలాల్లో ప్రభుత్వ కాలేజీలు లేవు. గత ఏడాది జూలూరుపాడు మండలంలో కూడా లేదు. ఈసారి అక్కడ సెంటర్ వచ్చింది. దూరం వెళ్లేవారికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. విద్యార్థుల కోసం ఆర్టీసీ సంస్థ తన బస్సులను అందుబాటులో ఉంచుతోంది. ఆళ్లపల్లి రూట్‌లో కొంచెం ఇబ్బంది ఉన్నమాట వాస్తవమే. అన్నపురెడ్డిపల్లి మండలంలో పరీక్షా కేంద్రం అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

**-- హెచ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి**

మండలం :పరీక్షా కేంద్రం: దూరం
ఆళ్లపల్లి :గుండాల: 25 కిలోమీటర్లు
కరకగూడెం పినపాక :15 కిలోమీటర్లు
దమ్మపేట :అశ్వారావుపేట :12 కిలోమీటర్లు
సుజాతనగర్ :కొత్తగూడెం: 13 కిలోమీటర్లు
అన్నపురెడ్డిపల్లి :చంద్రుగొండ: 17 కిలోమీటర్లు

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

తమ గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జియో టవర్ నిర్మించుటకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డి విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.వైరా మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన ఎస్సీ కాలనీ వాసులు నిరుపయోగంగా ఉన్న ఎన్.ఎస్.పి. కెనాల్ స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వైరా మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.